# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 05-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం పూర్వ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ పోరాడారని గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కొనియాడారు.
- ❖ నీటి సంరక్షణ - జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రకటించారు.
- ❖ రాష్ట్రంలో తీరప్రాంత మత్స్యకారుల సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
- ❖ శ్రీకాకుళం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు నేరడి బ్యారేజీని నిర్మిస్తామని మంత్రి కె. అచ్చెన్నాయుడు అన్నారు.

=====================

సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం పూర్వ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్ రామ్ పోరాడారని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ కొనియాడారు. బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా విజయవాడలోని లోక్‌భవన్‌లో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆధునిక వ్యవసాయ పద్ధతుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా జగ్జీవన్ రామ్ హరిత విప్లవానికి నాంది పలికారని, దాంతో దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని తెలిపారు.

=====================

ఈస్టర్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవ సోదరులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రేమ, విశ్వాసం, ఆశలకు ప్రతీక అని ఆయన అభివర్ణించారు. యేసుక్రీస్తు పునరుత్థానం, విశ్వాసులకు అత్యంత ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన సందర్భమని, ఈ పండుగ కరుణ,

నమ్మకం, భక్తి వంటి విలువలను గుర్తుచేస్తుందని తెలిపారు. మానవాళి పాప విమోచన కోసం యేసుక్రీస్తు చేసిన త్యాగం.. ప్రతి ఒక్కరూ శాంతి, ధర్మ మార్గంలో నడవడానికి స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు.

=====================

నీటి సంరక్షణ - జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు ప్రకటించారు. "నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత" పేరుతో రేపటి నుంచి జులై 14వ తేదీ వరకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టనుంది. అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో రేపు జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొననున్న నేపథ్యంలో కార్యాచరణ ప్రణాళికపై రాష్ట్రంలోని సాగునీటి సంఘాల సభ్యులతో ఈరోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. నీటి పారుదల, అటవీ, పంచాయతీరాజ్, వ్యవసాయం, పశు సంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఏప్రిల్ 6 నుంచి 15వ తేదీ వరకు పనుల గుర్తింపు కార్యక్రమాలు చేపట్టాలని, 16 నుంచి 20వ తేదీ వరకు గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలని, 21 నుంచి జులై 9వ తేదీ వరకు పనులను చేపట్టాలని ఆదేశించారు. ప్రజా చైతన్యం, ప్రజల భాగస్వామ్యంతో 100 రోజుల ఉద్యమాన్ని సమర్థంగా ముందుకు తీసుకెళ్లాలని చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

=====================

సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బాబూ జగ్జీవన్ రామ్ నిరంతరం పోరాడారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి మంత్రి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి.. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ...

(వాయిస్ 21 సెకన్లు)

=====================

శ్రీకాకుళం జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు నేరడి బ్యారేజీని నిర్మిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడారు. జిల్లాలో ప్రతి ఎకరాకు సాగు నీరు ఇవ్వాలనే ఆశయంతో పని చేస్తున్నామని ఆయన తెలియజేస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

విరామం

=====================

దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయడానికి తీసుకువచ్చిన జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2026 కు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపింది. జైలు శిక్షల స్థానంలో పౌర జరిమానాలను ప్రవేశపెట్టి, నేర తీవ్రతకు అనుగుణంగా శిక్షలను హేతుబద్ధీకరించడం, చిన్నపాటి పొరపాట్లకు లేదా సాంకేతిక ఉల్లంఘనలకు జైలు శిక్ష విధించే నిబంధనలను తొలగించడం దీని ప్రధాన ఉద్దేశ్యం. ఈ బిల్లు మొత్తం 79 కేంద్ర చట్టాల పరిధిలోని 784 నిబంధనలను సవరిస్తుంది. 717 నిబంధనలను నేరాల జాబితా నుండి తొలగించింది.

=====================

రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీలో మంత్రి ఈరోజు పర్యటించారు. పలు వార్డులను స్వయంగా పరిశీలించి.. అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం

పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. పాలకొండ నగర పంచాయతీలో 83 కోట్ల 50 లక్షల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

=====================

రాష్ట్రంలో తీర ప్రాంత మత్స్యకారుల సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన ఈరోజు సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల మత్స్యకారుల నుండి నెల్లూరు జిల్లాలోని మత్స్యకారులకు ఎదురవుతున్న సమస్యలు.. వాటి పరిష్కారం కోసం విస్తృతంగా చర్చించామన్నారు. సముద్రంలో గస్తీ కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నాలుగు బోట్లను కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

=====================

ప్రతి ఇంటికి తాగు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం ముద్దలాపురం వద్ద 16 ఎం.ఎల్.డి వాటర్ ప్లాంట్ ను పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణతో కలిసి మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... ప్రజలకు సురక్షిత మంచి నీరు అందించడం తమ ధ్యేయమన్నారు. అనంతపురం నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

=====================

ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రహదారులు, భవనాలు, మౌలిక వసతుల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరంలో సువర్ణముఖి నదిపై పునఃనిర్మించిన వంతెన, నూతన బస్ షెల్టర్, పలు రహదారులను ఈ రోజు ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... గుంతలు లేని రహదారులే లక్ష్యంగా రానున్న 6 నుండి 9 నెలల్లో పనులు చేపట్టేందుకు ప్రభుత్వం 7 వేల కోట్ల రూపాయలు కేటాయించిందన్నారు. జిల్లా వ్యాప్తంగా వందల కిలోమీటర్ల మేర బీటీ రహదారుల పనులు ప్రారంభమయ్యాయని, పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలను చెల్లించి.. కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు.

=====================
=====================